## తెల్లారితే పెండ్లి .. వరుడి ఆత్మహత్య

- జగిత్యాల జిల్లా రామచంద్రంపేటలో విషాదం



కిరణ్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి 8: ఆ ఇంట్లో తెల్లారితే పెండ్లి .. ఓ వైపు పెండ్లి పనులు కొనసాగుతున్నాయి. ఇంతలోనే పెండ్లి కొడుకు ఉరేసుకొని ఆత్మహత్య .. ఈ విషాదకర ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల అనుబంధ గ్రామం రామచంద్రంపేటలో చోటుచేసుకున్నది. మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం..రామచంద్రంపేటకు చెందిన లక్కంపెల్లి కిరణ్(37) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వెల్లుల్లకు చెందిన యువతితో ఈనెల 9న వివాహం నిశ్చయించారు. శుక్రవారం రాత్రి కిరణ్ తన గదిలో పడుకోగా,శనివారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా కిరణ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. కిరణ్‌కు ఆరోగ్య సమస్యలు ఉండడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

# కోతులకు కళ్లెం వేసేదెలా..?

- నిర్మల్‌లోని రెస్క్యూ సెంటర్‌లో పెరగని స్టెరిలైజేషన్లు
- నిధుల కొరతతో సహకరించని స్థానిక సంస్థలు
- నాలుగేళ్లలో 1547 స్టెరిలైజేషన్లు
- బీఆర్ఎస్ హయాంలోనే మొదటిసారిగా సెంటర్ ఏర్పాటు



నిర్మల్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రోజురోజుకూ కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. దీంతో వాటి ఆగడాలు తాళలేక ప్రజలతోపాటు రైతులు బెంబేలెత్తుతున్నారు. వీటి సంతాన ఉత్పత్తి ప్రక్రియ వేగంగా కొనసాగుతూ ఉండడంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండాపోతుంది. రాత్రింబవళ్లు వీటి సంచారంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. అలాగే పొలాలపై కూడా కోతుల గుంపులు దాడులు చేసి పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. ఈ సమస్యపై గతంలో కేసీఆర్ ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో నిర్మల్ శివారులోని గండిరామన్న హరితవనం ప్రాంగణంలో రాష్ట్రంలోనే ఏకైక మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. అయితే వన్య ప్రాణుల రక్షణ చట్టానికి అనుగుణంగా కోతులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం లేకపోవడంతో ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌లో వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఒక డాక్టర్‌తోపాటు ఫార్మాసిస్టు, నలుగురు అటవీ సిబ్బందిని నియమించారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు కోతులను పట్టించి ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌కు తీసుకొస్తే వాటికి స్టెరిలైజేషన్(కుటుంబ నియంత్రణ) ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. అయితే నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు స్థానిక సంస్థల నిర్లక్ష్యం కారణంగా కేవలం 1547 స్టెరిలైజేషన్లు మాత్రమే చేశారు. ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌లో నెలకు దాదాపు 500లకు పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్కో కోతిని పట్టేందుకు రూ.1000 వరకు ఖర్చు అవుతుండడంతో అసలే నిధుల కొరతతో సతమతమవుతున్న పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఇది మరింత భారంగా మారింది. కోతుల సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ, నిధుల కొరత కారణంగా వాటిని పట్టించే పరిస్థితి లేకుండా పోయిందని పలువురు మాజీ సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు పేర్కొంటున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే చొరవ చూపి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### వీడీసీలు ముందుకు రావాలి..

ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అనేక గ్రామాల్లో కొనసాగుతున్న వీడీసీ(విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ)లు కోతుల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వీడీసీలు సమాంతర వ్యవస్థ నడుపుతుండడమే కాకుండా అక్కడి ఆర్థిక వనరులన్నింటినీ తమ గుప్పిట్లో ఉంచుకున్నాయన్న వాదనలున్నాయి. గ్రామ పంచాయతీల కన్నా వీడీసీలే ఆర్థికంగా బలంగా ఉండడంతో కోతుల తరలింపు బాధ్యతను కూడా ఆయా వీడీసీలే తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### టాటూలతో స్టెరిలైజేషన్ గుర్తింపు ఈజీ..

నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో స్టెరిలైజేషన్ చేసిన కోతులకు ఇక్కడి వైద్య సిబ్బంది వాటి నుదుటిపై టాటూలు వేస్తున్నారు. ఇలా టాటూలు కనిపించిన కోతికి స్టెరిలైజేషన్ పూర్తయినట్లు ఈజీగా తెలిసిపోతుంది. స్టెరిలైజేషన్ పూర్తయిన కోతులకు ఇక సంతానోత్పత్తికి అవకాశం ఉండదు. దీంతో క్రమంగా వాటి సంఖ్యను తగ్గించవచ్చని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. 2 నుంచి 3 ఏళ్ల వయసు ఉండడం లేదా వయసు తక్కువగా ఉన్నప్పటికీ బలంగా ఉన్న కోతులకు స్టెరిలైజేషన్ చేస్తున్నారు.

### సౌకర్యాలు ఉన్నాయి.. సద్వినియోగం చేసుకోండి..

నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ రిహాబిటేషన్ సెంటర్‌లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి సెంటర్ నిర్వహణకు వైద్యుడితోపాటు అవసరమైన మేరకు సిబ్బంది కూడా ఉన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చొరవ తీసుకుని కోతులను పట్టించి సెంటర్‌కు తీసుకురావాలి. ప్రతినెల 500లకు పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి. కోతుల సంతానాన్ని నిరోధించాలంటే స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గం.

–డాక్టర్ శ్రీఖర్‌రాజు, మంకీ రెస్క్యూ సెంటర్ మెడికల్ ఆఫీసర్, నిర్మల్.



నవీపేటలో కిటకిటలాడుతున్న మేకల అంగడి

## మేకల అంగడి @ రూ.4 కోట్లు

- నవీపేటలో జోరుగా జీవాల క్రయవిక్రయాలు

నవీపేట, మార్చి 8: నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మేకల అంగడిలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన మేకలు, గొర్రెల క్రయ విక్రయాలతో రూ.4 కోట్లకుపైగా వ్యాపారం జరిగినట్లు వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 14న హోలీ పండుగతోపాటు వరుసగా వివాహాలు, శుభకార్యాలు ఉండటంతో అంగడికి మరింత డిమాండ్ పెరిగింది. రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, పుణె, ఉత్తరప్రదేశ్, హర్యానా, కర్ణాటక, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు పెద్ద మొత్తంలో జీవాల క్రయ విక్రయాలు చేపట్టారు. జీవాలతో అంగడి కిక్కిరిసిపోవడంతో బాసర రోడ్డు పైనే క్రయ విక్రయాలు కొనసాగాయి.



రోడ్డుపై గుంతలను పూడ్చి వేయిస్తున్న పీఆర్ ఈఈ, సీఐ, ఎస్సై

## ఎట్టకేలకు ఉచిత రవాణా

**'నమస్తే కథనం'తో దారి దోపిడీకి చెక్**

నమస్తే ఎఫెక్ట్

టేకుమట్ల, మార్చి 8 : అంతర్ జిల్లాలను కలిపే మానేరు వాగుపై ఎట్టకేలకు ఉచిత రవాణ కొనసాగుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గర్మిళ్లపల్లి శివారు కలికోటపల్లి– పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడెడు గ్రామాల మధ్య మానేరువాగులో అక్రమ వసూళ్ల దందాపై ఈ నెల 1న 'దర్జాగా దారి దోపిడీ' కథనం 'నమస్తే తెలంగాణ' మొయిన్‌లో ప్రచురితమైన విషయం తెలిసిందే.. దీంతో అధికారులు టోల్ తీసేశారు. దీనిని జీర్ణించుకోలేని దుండగులు మట్టిరోడ్డుపై గుంతలు తవ్వి రవాణాకు ఆటంకం కలిగించారు. దీంతో 'మానేరు వాగులో రోడ్డుపై గుంతలు' కథనం శుక్రవారం జిల్లా పేజీలో వచ్చింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. శనివారం పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్, టేకుమట్ల ఎస్సై సుధాకర్ వాగును సందర్శించి రోడ్డుపై తవ్విన గుంతలను జేసీబీతో పూడ్చివేయించారు. ఎవరైనా రోడ్డును ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అటకెక్కిన చేనేత పథకాలు !

- వచ్చే బడ్జెట్‌లోనూ నేతకార్మికులకు మొండి చెయ్యి తప్పదా..?
- సంక్షేమ బోర్డుకు రూ.1000 కోట్లు ఏవని ప్రశ్నిస్తున్న నేతలు
- రూ.5 లక్షల పెట్టుబడి సాయం మరిచిన కాంగ్రెస్ సర్కార్
- రేవంత్ తీరుపై కార్మికుల ఆగ్రహం



హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో చేనేత రంగాన్ని కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విస్మరించింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేతలతోపాటు పవర్ కార్మికులనూ కష్టాలపాలు చేసింది. విజయవంతంగా కొనసాగుతున్న వస్త్ర కార్మికుల పథకాలను రద్దు చేసింది. బీఆర్ఎస్ హయాంలో ఆదరణ పొందిన బతుకమ్మ చీరల పథకంపై సీఎం రేవంత్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కడంతోపాటు ఏకంగా ఆ పథకాన్నే రద్దు చేశాడు. దీంతో వస్త్ర కార్మికులకు రాష్ట్రంలో ఉపాధి లేకుండా పోయింది. పనులు లేక, మగ్గాలు నడువక, పస్తులు ఉండలేక నేత కార్మికులకు ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయి.

### 'రెండు చీరల' పథకం అమలు ఎప్పుడు..?

బతుకమ్మ చీరల పథకం బదులుగా 'రెండు చీరల' పథకం ప్రవేశ పెట్టినట్టు సర్కారు పేర్కొన్నది. ఇంత వరకు దాని ఊసే లేదు. పైగా ఈ పథకం అమలుకు రూ.400 కోట్లకుపైగా కేటాయిస్తున్నామని, ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచే అమల్లోకి తెస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కాని ఇప్పటికీ నేతన్నలకు చీరల తయారీ బాధ్యతలూ ఇవ్వలేదు. పైగా ఈ సర్కారు అధి కారంలోకి వచ్చిన తర్వాత చేనేత చేయూత పథకంతోపాటు త్రిఫ్ట్ పథకాన్ని, నూలు రం గులకు నగదు బదిలీని కూడా రద్దు చేసింది.

### నిధులు పెంచండి: నేత కార్మికులు

2025–26 ఆర్థిక సంవత్సరంలో అయినా వస్త్ర పరిశ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలని, సబ్సిడీల అమలుతోపాటు రూ.1000 కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం నాయకుడు చెర్కు స్వామి, తెలంగాణ పవర్ లూమ్ కార్మిక సంఘం నాయకుడు కూరపాటి రమేశ్ డిమాండ్ చేశారు. ప్రతి నేత కార్మికుడికి రూ.5 లక్షల బీమా, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇండ్లు లేని కార్మికులకు హౌస్ కం వర్క్‌షెడ్ పథకాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. టెస్కో ద్వారా చేనేత సహకార సంఘాలలో నిల్వ ఉన్న వస్త్రాలను కొనుగోలు చేసి, నిధులు విడుదల చేయాలని కోరారు.

## ఫాల్కన్ స్కామ్ నిందితుడి విమానం సీజ్

శంషాబాద్ రూరల్, మార్చి 8: ఫాల్కన్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన అమర్‌దీప్ చార్టర్డ్ విమానాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సీజ్ చేసింది. దుబాయ్ నుంచి ఆ విమానం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చినట్టు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి వెళ్లి సీజ్ చేసినట్టు ఈడీ అధికారులు వెల్లడించారు. ఫాల్కన్ కుంభకోణం ద్వారా కొల్లగొట్టిన సొమ్ము నుంచి అమర్‌దీప్ రూ.14 కోట్లు వెచ్చించి ఆ విమానాన్ని కొనుగోలు చేసినట్టు గుర్తించామని తెలిపారు. అమర్‌దీప్ సహా ఈ స్కామ్‌లోని కీలక నిందితులు పరారీలో ఉన్నారని, ప్రస్తుతం పవన్, కావ్య అనే ఇద్దరు వ్యక్తులను మాత్రమే అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. పెట్టుబడుల పేరుతో 6,979 మందిని మోసగించి రూ. 1,700 కోట్లు దోచుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాల్కన్ గ్రూప్‌పై కేసు నమోదైన విషయం విదితమే. దీన్ని ఆధారంగా ఈడీ దర్యాప్తు జరుపుతోంది.



ఎల్లారెడ్డిపేట : మహిళా పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ యూత్ వింగ్ నాయకులు



వేములవాడ : కోర్టు ఆవరణలో మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న న్యాయమూర్తి జ్యోతిర్మయి

# వనితా వందనం

- ఘనంగా మహిళా దినోత్సవం
- జిల్లావ్యాప్తంగా వేడుకలు
- పలు రంగాల్లో రాణిస్తున్న అతివలకు సన్మానం

**జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టి వేడుకలు నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న వారితోపాటు మహిళా ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.**

ఎల్లారెడ్డిపేట, మార్చి 8: ఇంటిని కాపాడే అమ్మలాగే ఊరిని శుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికురాలు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి మురళీ మోహన్, బీఆర్ఎస్ యూత్‌వింగ్ నాయకుడు చందనం శివ మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ పరికరాలు అందించారు. మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య మహిళా కార్మికులను సన్మానించి, వారికి హ్యాండ్ గ్లౌజెస్, మాస్కులు అందించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకుడు దొనుకుల కల్యాణ్, తదితరులున్నారు.

ఇల్లంతకుంట, మార్చి 8 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులను ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ శాలువా కప్పి సన్మానించారు. మండల కేంద్రంలోని వాణీనికేతన్ పాఠశాలలో విద్యార్థుల తల్లుకు ఆటల పోటీలు నిర్వహించి ఎస్ఐ చేతుల మీదుగా బహుమతులు అందజేశామని కరెస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇక్కడ పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.

రుద్రంగి, మార్చి 8: మండల కేంద్రంలో మహిళా అధికారులు, మహిళలను కార్యదర్శి రాందాస్ శాలువాతో సత్కరించి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినపుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ఇక్కడ ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, మహిళ సంఘాల సభ్యులున్నారు.

ముస్తాబాద్, ఫిబ్రవరి 8 : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మహిళలను శాలువాలు కప్పి సన్మానించారు. తుర్కపల్లి గ్రామ సభలో ప్రత్యేక అధికారి పాల్వాయి కిషోర్, కార్యదర్శి పరశురాములు, మాజీ సర్పంచ్ కాషోల్ల పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, వీవో అధ్యక్షురాలు చింతకింది లావణ్య, వీవోఏ నగునూరి జమున, అంగన్వాడీ టీచర్ రొడ్డ బాల లక్ష్మి, ఆశ కార్యకర్త నల్లభారతి, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ, మార్చి 8: వేములవాడ కోర్టు ఆవరణలో మహిళా న్యాయవాదులతో కలిసి న్యాయమూర్తి జ్యోతిర్మయి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం మహిళా న్యాయవాదులను సన్మానించి బహుమతులు అందజేశారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మహిళా ఎస్ఐ వినీతరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ లత, పోలీస్ కానిస్టేబుల్ శ్యామల, హోంగార్డు సుజాతను వీర ప్రసాద్ సన్మానించి సత్కరించి బహుమతులు అందజేశారు. తెలంగాణ చౌక్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా సీపీఐ మహిళా నాయకురాలు కేవీ అనసూర్య ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

వేములవాడ రూరల్, మార్చి 8 : మహిళా దినోత్సవం సందర్భంగా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న లహరి ప్రియ, స్వరూప బ్లూ కోల్ట్స్ విధులు నిర్వహించారు. అలాగే తెలంగాణ సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులను ఎంపీడీవో మల్హోత్రా సన్మానించారు. మండలంలోని నమిలిగుండుపల్లిలో వేములవాడ రూరల్ ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్‌ను డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, కల్చరల్ కోఆర్డినేటర్ సంధ్యారాణి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కోనరావుపేట, మార్చి 8: మండల కేంద్రంలో పీహెచ్‌సీలో పనిచేసే ఆశ కార్యకర్తలకు మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ చీరెలు పంపిణీ చేశారు. అలాగే నిమ్మపల్లి, మామిడిపల్లి, మరిమడ్ల గ్రామాల్లో పంచాయతీ మహిళా కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. ఇక్కడ మాజీ మార్కెట్ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, బీజేపీ మండలాధ్యక్షుడు బాలాజీ, లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేశ్ నాయక్, నేతలు ప్రతాపరెడ్డి, దొంతరవేణి శ్రీనివాస్, కుమ్మరి దిలీప్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాసాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి, మార్చి 8: పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు గ్రామ సభలు నిర్వహించి మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్, ఉపాధి హామీ ఏపీవో రాజయ్య, కార్యదర్శులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు వస్తే ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

వేములవాడ, మార్చి 8: సమస్యలు ప్రతి ఒక్కరికీ వస్తాయని, ఆ సమయంలో ఆత్మస్థైర్యం కోల్పోవద్దని వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి అన్నారు. మెగా లోక్ అదాలత్, మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటీవలే వివాహిత మ్యాన పల్లవి ఆత్మహత్య చేసుకోగా భావోద్వేగానికి గురయ్యారు. పల్లవి క్షణికావేశంలో నిర్ణయం తీసుకోవడం తనను కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ చదువుకొని ఉన్నతంగా ఎదిగి, ఆత్మస్థైర్యంతో ఉండాలని ఆమె సూచించారు.

### కందేపికి మాతృదేవోభవ పురస్కారం



మాతృదేవోభవ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కందేపి రాణిప్రసాద్

సిరిసిల్ల టౌన్, మార్చి 8: సిరిసిల్లకు చెందిన బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణిప్రసాద్ మరో అరుదైన పురస్కారాన్ని అందుకున్నారు. లేఖిని రచయిత్రుల వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంయుక్తంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణిప్రసాద్ తన సాహిత్యంతోపాటు సిరిసిల్లలోని సృజన్ చిల్డ్రన్ హాస్పిటల్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలకు గాను నిర్వాహకులు మాతృదేవోభవ పురస్కారాన్ని అందజేసి అభినందించారు. సిరిసిల్లకు చెందిన సాహితీవేత్తలు, రచయితలు ఆమెను అభినందించారు

### సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడుదాం

కలెక్టరేట్, మార్చి 8 : అన్ని రంగాల్లో మహిళలు సమాన పనికి సమాన వేతనం కోసం పోరాటాలు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సూరం పద్మ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్, సీఐటీయూ నాయకులు మిట్టపల్లి రాజమల్లు, జిందం కమలాకర్, నక్క దేవదాస్, మహిళా నాయకులు రైసా బేగం, కొక్కుల యశోద, సబ్బని శాంతమ్మ, బోడ శ్యామల, కల్పన, సుజాత, అరుణ, సౌమ్య, కోడం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

కలెక్టరేట్, మార్చి 8 : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, పురుషులతో సమానంగా పోటీ పడి పనిచేయాలని ప్రభుత్వ దవాఖాన గైనకాలజిస్టు మాధవి అన్నారు. సిరిసిల్ల కొత్త బస్టాండులో ఆర్టీసీ డీఎం ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు మహిళలు పురుషులతో పోటీపడి పనులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఇక్కడ ట్రాఫిక్ సూపర్‌వైజర్ వర్జిల్లాల్, రామకృష్ణ, రామ్‌రెడ్డి, మల్లేశ్, శ్రీనివాస్, శేఖర్, సంతోష్, కృష్ణారెడ్డి, ఉద్యోగులున్నారు.



ఇల్లంతకుంట: పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులకు శాలువా కప్పి సన్మానిస్తున్న ఎస్ఐ



వేములవాడ రూరల్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు



కోనరావుపేటలో ఆశ కార్యకర్తకు చీర అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ



కలెక్టరేట్ : మాట్లాడుతున్న ప్రభుత్వ దవాఖాన గైనకాలజిస్ట్ మాధవి

## రాజన్నను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్ బాబు




కోడెమొక్కు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యేలతో కలిసి కుటుంబ సభ్యులు

వేములవాడ టౌన్/ కోనరావుపేట, మార్చి 8 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని శనివారం మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు సతీమణి మరియా, కుమార్తె సంగీత, కాబోయే అల్లుడు మార్క్స్ రాజన్నను దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం వారు విలేఖరులతో మాట్లాడుతూ, వేములవాడ మాకు కన్నతల్లి లాంటిదని మేమంతా వేములవాడ మట్టి మనుషులమని ఇక్కడున్న ప్రజలంతా సుభిక్షంగా ఉండడమే మా ఏకైక కోరిక అన్నారు. అలాగే, కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, మాజీ వైస్‌ఎంపీపీ తీగాల రవీందర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ నాగరాజు, తదితరులున్నారు.

## లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

**న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైశ్వాల్**





మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైశ్వాల్

గాంధీ చౌక్, మార్చి 8 : లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసులు సత్వరమే పరిష్కారమవుతాయని సిరిసిల్ల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైశ్వాల్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే డబ్బు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో 11,443 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణచారి, జూనియర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్ కుమార్, సృజన, మేఘన, ఏఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెండ శ్రీనివాస్, లోక్ అదాలత్ మెంబర్లు చింతోజు భాస్కర్, వేణు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వేములవాడ రూరల్, మార్చి 7 : వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ శివారులో గురువారం రాత్రి గేదెపై పులే దాడిచేసి చంపిందని ఫారెస్టు అధికారి ఖలీలొద్దిన్ నిర్ధారించారు. శనివారం వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌గనర్ శివారులోని ఆటవీప్రాంతంలో పెద్దపులి ఆనవాళ్లు పరిశీలించారు. గ్రామస్తుడు నారాయణకు చెందిన గేదెను పెద్దపులి చంపిందని అక్కడి ఆనవాళ్లను గుర్తించామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీప్రాంతంలో సంచరించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

### వైకుంఠ రథం వితరణ

చందుర్తి, మార్చి 8: సొంతూరిపై మమకారం, తండ్రి మల్లయ్య జ్ఞాపకార్థం ఎన్నారై కుంట మోహన్ శనివారం సుమారు రూ.3 లక్షల విలువైన వైకుంఠ రథాన్ని పంచాయతీకి అందించారు.ఇక్కడ చింతపంటి రామస్వామి, మాజీ ఉపసర్పంచ్ కాసారపు శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులున్నారు.

### ఎక్సైజ్ అధికారుల సస్పెన్షన్

రాజన్న సిరిసిల్ల, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు పాటించకుండా లైసెన్స్ జారీ చేసిన ఇద్దరు ఎక్సైజ్‌శాఖ అధికారులను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సిరిసిల్లలోని చిత్ర బార్ అండ్ రెస్టారెంట్‌కు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ లేకుండానే 2బీ లైసెన్స్ రెన్యువల్ చేశారు. క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరిస్తూ, తప్పుడు వివరాలు నివేదికలు సమర్పించిన ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారి ఎస్ పంచాక్షరి, ఎక్సైజ్ ఎస్ఐ గులాం ముస్తఫాను బాధ్యులుగా పేర్కొన్నారు. ఈ మేరకు ఇద్దరని సస్పెండ్ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు.